క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం


కె.కోటపాడు : మండలంలో గొండుపాలెం ఫీడర్ పరిధిలో గల గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో బుధవారం అంతరాయం కలగనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. చౌడువాడలో నూతనంగా నిర్మిస్తున్న సబ్ స్టేషన్‌లో చేపడుతున్న పనుల నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. చౌడువాడ, మల్లంపాలెం గ్రామాల్లో వినియోగదారులు దీనికి గుర్తించి సహకరించాలని కోరారు.

దేవరాపల్లిలో సన్యాసమ్మతల్లి పండగ


ప్రత్యేక అలంకరణలో సన్యాసమ్మ తల్లి

దేవరాపల్లి: మండల కేంద్రంలో గల సన్యాసమ్మతల్లి పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితానాయుడు ఆధ్వర్యంలో జరిగిన పండగ మహోత్సవం సందర్భంగా భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కిక్కిరిసింది. ప్రతి ఏటా రోహిణి కార్తె మొదటి మంగళవారం పండగను నిర్వహించడం అనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ధ్వజస్తంభం, మహలక్ష్మమ్మ విగ్రహ ప్రతిష్టకు ఏర్పాట్లు


రోలుగుంటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం

రోలుగుంట : మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట, మహలక్ష్మమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను బుధవారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ వారు తెలిపారు. ఈ నెల 4వ తేదీ బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి ప్రతిష్ట కార్యక్రమం అంకురార్పణ, జలాధివాసం, 5న గురువారం ఉదయం 8 గంటలకు పతాక ప్రతిష్ట, హోమాలు, సాయంత్రం ధాన్యాధివాసం, పంచశయ్యాధివాసం కార్యక్రమాలు, 6వ తేదీ శుక్రవారం ఉదయం యంత్ర ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట మహలక్ష్మమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ట, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆ రోజు మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహిస్తామని తెలిపారు.

జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టండి


ఆశాలు, ఆస్పత్రి సిబ్బందితో సమావేశమైన డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి

రావికమతం : గిరిజన గ్రామాల్లో జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి సూచించారు. కొత్తకోట పీహెచ్‌సీని మంగళవారం ఆమె సందర్శించారు. ఆస్పత్రి రికార్డులు పరిశీలించారు. ఆశాలు, పీహెచ్‌సీ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆస్పత్రిలో ఓపి పెంచాలని బీపీ, సుగర్ రోగులను గుర్తించి మందులు అందించే బాధ్యత తీసుకోవాలన్నారు.గిరిజన గ్రామాల్లో జ్వరాలు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనులు దోమతెరలు వాడేలా చర్యలు చేపట్టాలన్నారు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సురేఖ పాల్గొన్నారు.

అర్జునగిరిలో విశాఖ డెయిరీ స్టాక్ పాయింట్


రిబ్బన్‌కట్ చేస్తున్న డెయిరీ చైర్మన్ ఆనంద్‌బాబు

చీడికాడ : అర్జునగిరిలో విశాఖ డెయిరీకి చెందిన స్టాక్‌పాయింట్, పార్లర్‌ను విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌బాబు మంగళవారం ఉదయం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ విశాఖ డెయిరీకి పాలుపోస్తున్న ప్రతి పాడి రైతు కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామన్నారు. ఈ మేరకు అర్జునగిరి విశాఖ డెయిరీ కల్యాణ మండపం వద్ద బోరు వేయించాలని సంఘం అధ్యక్షుడు పెంటకోట శేషు కోరగా అందుకు సానుకూలంగా స్పందించారు.


వడ్డాది వద్ద గోతుల మయంగా మారిన రోడ్డు

కూటమి నేతల హామీకి ఏడాది!

అధికారంలోకి వస్తే ఏడాదిలో బీఎన్ రోడ్డు బాగు చేస్తామన్నారు...కూలిన వంతెనలు తిరిగి నిర్మిస్తామన్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆదుకుంటామన్నారు... చోడవరం నియోజకవర్గాన్ని వ్యవసాయ హబ్‌గా చేస్తామన్నారు...పరిశ్రమలు తెచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు...డిగ్రీ కాలేజీ, జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేస్తామన్నారు..కానీ ఏడాది గడిచినా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలు ఆపేశారు...ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టారు. ఇంటింటికీ రేషన్ నిలిపివేశారు...ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారు...బీఎన్ రోడ్డు సమస్య గాలికొదిలేశారు...ఇలా ఏడాది కాలంలో కూటమి పాలన తీరుపై జనం మండిపడుతున్నారు.

- బీఎన్ రోడ్డు, వంతెన నిర్మాణమేది?
- గోతులు కూడా పూడ్చలేని ప్రభుత్వం
- అతీగతీలేని సూపర్ సిక్స్
- కూటమి పాలన తీరుపై మండిపడుతున్న జనం

బుచ్చెయ్యపేట : కూటమి నేతలు మాటలు కోటలు దాటాయి. కానీ చేతలు మాత్రం గడప కూడా దాటలేదు. అధికారంలోకి వస్తే ఏడాదిలోనే పాలనేంటో చూపిస్తామన్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల హామీలు ఒక్కటీ అమలు కాలేదు. ఎన్నికల ముందు ఐటీశాఖ మంత్రి లోకేష్ వడ్డాదిలో బహిరంగ సభ ఏర్పాటు చేసి అధికారంలోకి వచ్చిన వెంటనే భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎన్) రోడ్డును బాగు చేస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కనీసం రోడ్డు గోతులను కూడా పూడ్చలేదని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నేటికి ఏడాదైనా రోడ్ల సమస్య పట్టించుకోలేదు. విజయరామరాజుపేట, వడ్డాది, ఎల్‌బీ పురం, బంగారుమెట్ట, లోపూడి, శింగవరం, పీడీ పాలెం వద్ద పెద్దపెద్ద గోతులు ఏర్పడి నూతుల్లా తయారయ్యాయి. బీఎన్ రోడ్డు బాగు చేయకపోగా కనీసం గోతులను కూడా పూడ్చలేదు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆదుకుంటామని, చోడవరాన్ని వ్యవసాయ హబ్‌గా మారుస్తామని, పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పిస్తామని అన్నారు. అధికారంలోకి వచ్చాక ఆ దిశగా ఒక్క అడుగైనా పడలేదు. ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజువిజయరామరాజుపేట, వడ్డాదిలో కూలిన వంతెనలను నిర్మిస్తామని, బీఎన్ రోడ్డు బాగు చేస్తామని, మేజర్ పంచాయితీ వడ్డాదిలో ఏసీ కల్యాణ మండపం నిర్మిస్తామని, ఇంటింటికీ తాగునీరు అందిస్తామని, కాపు సామాజిక భవనం పూర్తి చేస్తామని, వడ్డాది కస్పా కాలువకు సిమెంట్ లైనింగ్ చేస్తామని, వడ్డాదిలో డిగ్రీ కాలేజీ, రాజాంలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేస్తామని హామీలిచ్చినా ఒక్కటీ అమలు కాలేదు. కూటమి నాయకులు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కటి అమలు కాకపోగా ఇంటింటి కి రేషన్ బియ్యం అందకుండా చేయడం, ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేయడంపై ప్రజలు కూటమి పాలన తీరుపై మండిపడుతున్నారు.

అన్నీ బూటకపు హామీలే...



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. బీసీలకు యాభై ఏళ్లకే పింఛన్ ఇస్తామన్నారు. ఒక్కరికైనా ఇచ్చారా...? రైతు భరోసా, అమ్మ ఒడి డబ్బులు వేయలేదు. ఓటు వేయకముందు ఒకమాట గెలిచిన తరవాత మరో మాటలా కూటమి పాలన కనిపిస్తుంది.

-ఎం.అప్పారావు, గున్నెంపూడి

ఏ సమస్యనూ తీర్చలేదు...



గోవాడ సుగర్ ఫ్యాక్టరీని అభివృద్ధి చేస్తామన్నారు. కనీసం కూటమి ప్రభుత్వం గద్దె నెక్కిన తరవాత లక్ష టన్నులు కూడా క్రషింగ్ సరిగా చేయలేకపోయారు. మా ఊరిలో కూలిపోయిన తాచేరు వంతెన కడతామన్నారు. వంతెన పనులు ప్రారంభించకపోగా కనీసం డైవర్షన్ రోడ్డు బాగు చేయలేదు, రోడ్డు గోతులను పూడ్చలేదు.

– ఎల్లపు గోవింద, విజయరామరాజుపేట

ఘనంగా కోటమ్మ తల్లి పండగ


ధ్వజస్తంభం వద్ద మహిళల పూజలు


అమ్మవారి దర్శనం కోసం క్యూలో భక్తులు

నాతవరం : మండల కేంద్రంలో గల కోటమ్మ తల్లి పండగ మహోత్సవాన్ని భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు మంగళవారం తెల్లవారు నుంచే అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది, మహిళలు అమ్మవారికి చీర, జాకెట్, పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనం కోసం మండుటెండలో సైతం భక్తులు గంటల తరబడి క్యూలో నిల్చున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని మజ్జిగ, తాగునీరు ఉచితంగా సరఫరా చేశారు. భక్తులకు దాతలు పులిహోర, చక్కెర పొంగలి ప్రసాదం పంపిణీ చేశారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో పురవీధులు జనంతో కిక్కిరిసాయి. పండగ సందర్భంగా మంగళవారం రాత్రి గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పండగ సందర్భంగా వారం రోజులుగా నిర్వహించిన పలు ఆటలు పోటీల్లో నైపుణ్యం కనబరిచిన క్రీడా కారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. గ్రామంలో వాహనాలు రాకపోకలు కారణంగా పలుమార్లు ట్రాఫిక్ సమస్య తలెత్తింది. పండగ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాతవరం ఎస్‌ఐ భీమరాజు బందోబస్తు ఏర్పాటు చేశారు.

6న కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణం


కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 15వ వార్షిక కల్యాణోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్త చైర్మన్ రాపేట రామకొండలరావు, ఇతర సభ్యులు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈనెల 6వ తేదీ ఉదయం స్వామి వారి కల్యాణం జరుగుతుందన్నారు. అంతకుముందు 5వ తేదీన అంకురార్పణ, విశ్వక్షేణపూజ, పుట్టమట్టి తెచ్చుట, నవకలశస్నపణం, జరుగుతుందన్నారు. 6న ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద 6వ తేదీ మధ్యాహ్నం భజన పోటీలు ఏర్పాటు చేసి నగదు బహుమతులు అందిస్తామన్నారు. ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు. 12వ తేదీన ఉత్సవాలు ముగుస్తాయని, ఉత్సవాల విజయవంతానికి భక్తులు సహకరించాలని కోరారు.

ఘనంగా రైవాడ ఎరుకలమ్మ పండగ


రైవాడ ఎరుకలమ్మ ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

దేవరాపల్లి : రైవాడ గ్రామ ప్రజలు ఆరాధ్య దైవం ఎరుకలమ్మ తల్లి పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. 13 సంవత్సరాలు తర్వాత అమ్మవారి పండగను గ్రామస్తులు ఆనందంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారిని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం క్యూలో భక్తులు బారులు తీరారు. పండగ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ప్రకృతి సాగు విధానంతో రైతులకు లబ్ధి


వారాడలో ప్రకృతి సాగు విధానంలో పండిస్తున్న పంటలను పరిశీలిస్తున్న ఏవో సోమశేఖర్

కె.కోటపాడు : ప్రకృతి సాగు విధానంలో పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహనను కల్పించాలని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. మండలంలో వారాడ, ఉగ్గినవలస గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఆయన రైతు సేవా కేంద్రాల్లో గల వ్యవసాయశాఖ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రకృతి విధానంలో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. ప్రకృతి సాగుతో పండించే పంటలకు మంచి డిమాండ్, ధర ఉంటుందన్నారు. ఉగ్గినవలస గ్రామంలో శతశాతం ప్రకృతి సాగు విధానంలో రైతులు పంటలను పండిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం మండల కోఆర్డినేటర్ పాత్రుని నాయుడు, వ్యవసాయశాఖ సిబ్బంది పూజిత కల్యాణి, స్నేహ, సేవతి, కృష్ణవేణి, నాయుడు, రేవతి పాల్గొన్నారు.

6న మాడుగులలో జాబ్ మేళా

మాడుగుల : ఈ నెల 6వ తేదీన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మంగళవారం మాడుగులలో గోడపత్రిక ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్లేస్‌మెంట్ అధికారి పి.శ్రీనివాస్, స్కిల్ హబ్ ఇన్‌చార్జి, కె.లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఉందూరు దేముడు, అద్దేపల్లి జగ్గారావు పాల్గొన్నారు.

జీలుగు, జనుము విత్తనాలు పంపిణీకి సిద్ధం

రోలుగుంట: మండలంలో గల అన్ని గ్రామాల రైతులకు పంపిణీ చేసేందుకు వ్యవసాయ కార్యాలయంలో జనుము, జీలుగు విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయశాఖాధికారి ఎస్. విజయలక్ష్మి తెలిపారు. ఈ విత్తనాలు కావల్సిన రైతు ఆధార్, పట్టాదారుపాస్ పుస్తకాల జెరాక్స్ కాపీలను వ్యవసాయ కార్యాలయంలో సిబ్బందికి అందజేసి, వివరాలు నమోదు చేసుకొని విత్తనాలు తీసుకెళ్లాలని ఆమె కోరారు.

ఉత్సాహంగా ఎడ్ల పరుగు పోటీలు


పోటీల్లో దౌడు తీస్తున్న ఎడ్లు

నాతవరం : మండల కేంద్రంలో మంగళవారం కోటమ్మ తల్లి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈపోటీలకు 10 ఎడ్ల బళ్లు పాల్గొనగా పోటీలను ఉత్సవ కమిటీ సభ్యులు పైల పోతురాజు, శెట్టి లోవ, అపిరెడ్డి మాణిక్యం, పోలిరెడ్డి రాజు జివిరెడ్డి రాజుబాబు జెండా ఊపి ప్రారంభించారు. మొదటి స్థానంలో లెక్కలవానిపాలెం గ్రామానికి చెందిన పెద్ద పైడితల్లిమ్మ ఎడ్ల బండి నిలిచింది. రెండో స్థానంలో నాతవరం గ్రామానికి చెందిన అంకంరెడ్డి గోవింద్, మూడో స్థానంలో ఎల్.ఎల్.పట్నంకు చెందిన బండారు హేమ తేజ, నాలుగో స్థానంలో ఎం.కోటపాడు గ్రామానికి చెందిన వీర ఆంజనేయ, ఐదో స్థానంలో నాతవరం గ్రామానికి చెందిన శెట్టి శ్రీను ఎడ్ల బళ్లు పోటీల్లో నిలిచాయని నిర్వాహకులు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.15వేలు, రెండో బహుమతి రూ.12వేలు, మూడో బహుమతి రూ. 10వేలు, నాలుగో బహుమతి రూ.8వేలు, ఐదో బహుమతి రూ.6వేలు చొప్పున అందజేశారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణదారులపై చర్యలేవీ


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న మండల వైస్ ఎంపీపీ భవానీప్రసాద్, జనసేన నాయకులు

రావికమతం : కబ్జా కోరల్లో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలని మండల వైస్ ఎంపీపీ భవానీప్రసాద్, గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు సీతిని శివ, మాజీ ఎంపీటీసీ రాజాన అప్పలనాయుడు, యూత్ లీడర్ మచ్చా వెంకటరమణ తదితరులు మంగళవారం మండల తహసీల్దార్ వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో బీఎన్ రోడ్డు నుంచి టి.అర్జాపురం వెళ్లే మార్గంలో ఉన్న ప్రభుత్వ స్థలం (గోర్జు)ను గ్రామానికి చెందిన ఎర్రంశెట్టి నాయుడు 4 సంవత్సరాల క్రితమే పక్కా భవనాన్ని నిర్మిస్తుండగా గ్రామంలో గల యువకులు, పెద్దలు అడ్డుకొని అప్పటి తహసీల్దార్‌కి ఫిర్యాదు చేయగా నిర్మాణాన్ని నిలుపుల చేశారన్నారు. ప్రస్తుతం ఆ స్థలంలో అదే వ్యక్తి పక్కా భవనం నిర్మిస్తున్నారు. దీనిపై వీఆర్వోకి ఫిర్యాదు చేసినా స్పందించలేదని, తక్షణం నిర్మాణాన్ని నిలుపుదల చేసి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని తహసీల్దార్‌ను కోరారు.

సత్యవరంలో రామలింగేశ్వర స్వామి ప్రతిష్ట మహోత్సవం


స్వామివారి విగ్రహాలకు జలాభిషేకం


ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న దంపతులు

మాడుగుల : సత్యవరంలో రామలింగేశ్వర స్వామి ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం గోపూజ నిర్వహించారు. అంగరంగ వైభవంగా యాగశాల ప్రవేశం నిర్వహించారు. సాయంకాలం మండప ఆరాధన, క్షీరాధివాసం, జలాధివాసం. కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన హరికథా భజన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సుమారు 8 మంది వేద పండితులు నడుమ గ్రామానికి చెందిన గృహస్తు దంపతులు ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. అలాగే స్వామి ప్రతిష్ట కార్యక్రమ మహోత్సవాలు ఈ నెల 5వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

మలేరియా వ్యాధిని తరిమికొడదాం


పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


దేవరాపల్లిలో పీహెచ్‌సీ సిబ్బంది మానవహారం

గొలుగొండ : మలేరియా వ్యాధిని అవగాహనతో తరిమికొట్టాలని, ప్రజలను నిత్యం ఈ వ్యాధిపై అప్రమత్తం చేయాలని గొలుగొండ వైద్యాధికారి శ్యామ్‌కుమార్ తెలిపారు. మలేరియా నివారణ మహోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం గొలుగొండ పీహెచ్‌సీ నుంచి మండల కార్యాలయాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మలేరియాపై ప్రజలకు అవగాహన కలిగించాలని సిబ్బందికి సూచించారు. ఇంటి ఆవరణలో నిల్వనీరు లేకుండా చూడాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో సిహెచ్‌వో ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ ఫకీర్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లి : మలేరియా మాసోత్సవాల్లో భాగంగా దేవరాపల్లి పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం దేవరాపల్లిలో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యాధికారి వనజ, ఇతర సిబ్బంది సారధ్యంలో నాలుగు రోడ్లు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. దోమల నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ ఎం.ఆనంద్, హెచ్‌సి పుష్పరాజ్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎస్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలు మరిచిన ప్రభుత్వంపై నేడు ‘వెన్నుపోటు’ ఆందోళన

మాజీమంత్రి, సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్


పోస్టర్ విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు


రావికమతంలో పోస్టర్‌ను విడుదల చేస్తున్న మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

చోడవరం : ఏడాది కాలం పూర్తయినా వారి మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలేవీ నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై ఈ నెల 4వ తేదీన వెన్నుపోటు దినంగా ఆందోళన చేస్తున్నామని, ఈ ఆందోళనలో ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు అంతా పాల్గొనాలని నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పిలుపు ఇచ్చారు. గతేడాది జూన్ 4న కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిందని, ఈ ఏడాది కాలంలో హామీలేవీ నెరవేర్చలేదని పేర్కొన్నారు. ఎన్నికష్టాలైనా మా నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రజల పక్షాన నిరంతరం వైఎస్సార్‌సీపీ పోరాటాలు చేస్తూనే ఉంటుందన్నారు. దీనిలో భాగంగానే జూన్ 4న వెన్నుపోటు దిన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అంతా పాల్గొని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ఎండగట్టి ప్రజలకు తెలియజేయాలన్నారు. చోడవరం పట్టణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. బుధవారం ఉదయం 9గంటలకే అందరూ చోడవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి తరలిరావాలని అమర్‌నాథ్ పిలుపు ఇచ్చారు.

నిరసనను విజయవంతం చేయాలి

గొలుగొండ: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా నేటికీ ఒక్క హామీ కూడా నెరవేర్చని నేపథ్యంలో నర్సీపట్నంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ మాకవరపాలెం మండల నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల చేశారు. ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు చిటికెల రమణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. బుధవారం ఉదయం ప్రతి ఒక్కరూ నర్సీపట్నం చేరుకోవాలని కోరారు. వైస్ ఎంపీపీ రాజారావు, పెట్ల భద్రాచలం, రుత్తల రాజు పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలపై నేడు నిరసన

రోలుగుంట : కూటమి ప్రభుత్వం ఏడాది పాలన వైఫల్యాలను నిరసిస్తూ బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమం వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటు సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, ఆ పార్టీ చోడవరం నియోజకవర్గం ఇంచార్జి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో జరుగుతుందని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పోతల లక్ష్మీ రమణమ్మ మంగళవారం విలేకరులకు తెలిపారు. పార్టీ కార్యాలయం నుంచి బుధవారం ఉదయం 9:30 గంటలకు ర్యాలీగా ఆర్టీసీ కాంప్లెక్సు వరకూ వెళ్లి అక్కడ నుంచి ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రావికమతం: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు , మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జగ్గారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం పిలుపునిచ్చారు. మంగళవారం దీనికి సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. చోడవరంలో జరిగే ఈ కార్యక్రమానికి మండలం నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీ, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బంటు సన్యాసినాయుడు, మాజీ వైస్ ఎంపీపీ గంటా ఈశ్వరరావు పాల్గొన్నారు.

15న తీరంలో వెయ్యి మందితో యోగా


కొత్త రేవుపోలవరం బీచ్‌లో పర్యటిస్తున్న అధికారులు

ఎస్.రాయవరం: కొత్త రేవుపోలవరం బీచ్‌లో ఈ నెల 15న వెయ్యి మందితో యోగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ, పాయకరావుపేట నియోజకవర్గ ప్రత్యేకాధికారి శచీదేవి తెలిపారు. రేవుపోలవరం, కొత్తరేవుపోలవరం గ్రామాల్లో మంగళవారం ఆమె పర్యటించారు. తీరంలో నేలను చదును చేసి ఎక్కువ మంది యోగాలో పాల్గొని శిక్షణ ఇవ్వాలన్నారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు, సమాచారం ఇవ్వాలని ఎంపీడీవో సత్యనారాయణకు సూచించారు. బీచ్ పరిసర ప్రాంతాలను పరిశీలించి పరిశుభ్రంగా తయారు చేసి ఆకర్షణీయంగా మార్చాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.రమేష్‌బాబు, ఏపీవో శివప్రసాద్, సర్పంచ్ మల్లే లోవరాజు, గుడివాడ మాజీ సర్పంచ్ నల్లపరాజు వెంకటరాజు, వీఆర్వీ అప్పలరాజు, నాయకుడు మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు పాల్గొన్నారు.